క్లుప్తంగా

భువనగిరి ఎంపీని కలిసిన ఆర్టీఏ మెంబర్



జనగామ రూరల్: జిల్లా ఆర్టీఏ మెంబర్‌గా నియమితులైన ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్ మంగళవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా రీజినల్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ మెంబర్‌గా అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అభిగౌడ్ పేర్కొన్నారు.

సన్మానం



కొడకండ్ల: గ్రూప్స్ ఫలితాల్లో సత్తా చాటిన మండలకేంద్రానికి చెందిన చెన్న ప్రణీత్‌ను పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం మండలకేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో పద్మశాలీ సంఘం నాయకులు ప్రణీత్‌తో పాటు అతని తల్లిదండ్రులు సోమనారాయణ–నాగలక్ష్మిలను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చెన్న ఉపేందర్, పొన్నం వెంకన్న, మనోహర్, చెన్న విష్ణు, ఎన్నం సత్తయ్య, దాసరి మధుసూదన్, రాపోలు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు..



బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ అబ్బాస్ కుమారుడు ఖాజా హసన్ ఇటీవల తమిళనాడు అన్నమలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకోగా మంగళవారం గ్రామస్తులు, పలు పార్టీల నాయకులు ఆయనను సన్మానించారు. నల్లగోని బాలకిషన్ గౌడ్, జిల్లా బుచ్చయ్య, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, గుర్రం బాల్‌రాజు ఉన్నారు.

మురళికి ఉగాది పురస్కారం



జనగామ రూరల్: పట్టణానికి చెందిన మరిగడి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, కవి, రచయిత, ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ పోయెట్ ఆథర్ రేణుకుంట్ల మురళి విశ్వావసు నామ సంవత్సర జాతీయ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపు పొందిన తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక అధ్యక్షుడు పీఆర్ఎస్ఎస్ ఎన్ మూర్తి, చైర్మన్ ఎం.నారాయణ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఈ జాతీయ ఉగాది పురస్కారం తల్లిదండ్రులకు, గురువులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

నియామకం



స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొలిపాక సతీష్ ఏఐసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న జైబాపు జైభీమ్ జై స్వామిధన్ కార్యక్రమానికి హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండల ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో తాను చేస్తున్న సేవలను గుర్తించి జైబాపు జైభీమ్ జైస్వామిధన్ భీమదేవరపల్లి మండల ఇన్‌చార్జ్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలోని అంబాత్రేయ క్షేత్రంలో ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న గోమాత కల్యాణ మహోత్సవ వాల్‌పోస్టర్‌ను మంగళవారం పట్టణంలోని గీతా ఆశ్రమంలో అర్చకుడు రాజేశ్వర్, సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ గోమాతను పూజించాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రంగయ్య, భూక్యా రాజు, ప్రధాన కార్యదర్శి ధరావత్ రమేష్, విజయ్ కుమార్, తులసి రామ్,ప్రవీణ్ రాజేష్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ అస్తవ్యస్తం

- కంపు కొడుతున్న రెండో వార్డు
- అవస్థల పాలవుతున్న ప్రజలు



జనావాసాల మధ్య నిలిచిన మురుగునీరు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్ రెండో వార్డులో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరంతా జనవాసాల మధ్య నిలిచి దుర్గంధం వ్యాపిస్తుంది. గత నెలలో స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా మారినప్పటికీ కాలనీవాసులకు తిప్పలు మాత్రం తప్పడం లేదు. రెండో వార్డులో డ్రెయినేజీ ఏర్పాటు చేయకుండా సీసీ రోడ్డు వేయడంతో వార్డుకు చెందిన మురుగునీరు రోడ్డుపై, ఇళ్ల మధ్య నిలుస్తుంది. దాంతో వార్డులో జనవాసాల మధ్య మురుగునీరు నిలిచి చిన్నపాటి కుంటను తలపిస్తుంది. ఈ విషయమై పలుమార్లు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కమిషనర్ ఇన్‌చార్జ్ కమిషనర్ కావడంతో వారంలో రెండు రోజులే వస్తున్నారని, దాంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సమస్యల్ని పట్టించుకోవడం లేదని వాపోయారు. మురుగు నీరు నిలిచి ఉండటంతో దోమలు, పందులు స్వైర విహారం చేస్తుండగా దుర్వాసనతో కాలనీవాసులు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

పడకేసిన ప్రత్యేక పాలన



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

తరిగొప్పుల: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది. దీంతో సమస్యల సుడిగుండంలో ప్రజలు సతమతమవుతున్నారు. మురుగుకాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని బొంతగట్టునాగారంలో పలు కాలనీల్లో డ్రెయినేజీలోని సిల్టు తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పాదాచారులు అసహనానికి గురవుతున్నారు. డ్రెయినేజీలో పేరుకు పోయిన మురుగు కారణంగా దోమలు విజృంభించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామంలో పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపట్టి రోగాల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

దేశానికే ఆదర్శం సన్న బియ్యం పంపిణీ

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



కొడకండ్ల: సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల/దేవరుప్పుల: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని రీతిలో తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం ఏడునూతుల, నీర్మాల గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నిరుపేద బడుగు బలహీన వర్గాలకు చెందిన రేషన్‌కార్డు లబ్ధిదారుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆయా కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఈరంటి సాయికృష్ణ, డైరెక్టర్‌లు, కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ అధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో..

రఘునాథపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు రేషన్‌షాపుల వద్ద తెల్ల రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఖిలాషాపూర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల కుమార్ ఆధ్వర్యంలో, కన్నాయపల్లిలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు లోనె శ్రవణ్‌కుమార్, ఇబ్రహీంపూర్‌లో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పోకల శ్రీనివాస్, ఇతర గ్రామాల్లోనూ మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని సన్న బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



రఘునాథపల్లి: కన్నాయపల్లిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న శ్రవణ్‌కుమార్

అరగంటే ఇచ్చారు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పేదలకు రేషన్‌కార్డుల ద్వారా ఈనెల 1వ తేదీ నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం రేషన్‌డీలర్లు ఉదయం సన్న బియ్యం పంపిణీ చేశారు. అరగంటపాటు కొంత మంది లబ్ధిదారులకు పంపిణీ చేయగా బియ్యం పంపిణీని ఆపాలని, నేడు(బుధవారం) స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా అధికారికంగా పంపిణీ చేస్తామని సంబంధిత అధికారులు డీలర్లకు ఆదేశాలు జారీ చేయడంతో వారు వెంటనే పంపిణీ బంద్ చేశారు. ఉదయం దాదాపు 8.30 గంటల నుంచి 9 గంటల వరకు శివునిపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, ఇప్పగూడెం, తానేదార్‌పల్లి తదితర గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ చేశారు. అప్పటికే పలువురు సన్నబియ్యం కోసం రేషన్‌కార్డుదారులు రేషన్ షాపుల వద్ద లైన్లలో ఉన్నారు. కాగా, అధికారుల ఆదేశాల మేరకు అరగంట తర్వాత బంద్ చేయడంతో పలువురు నిరాశగా వెనుతిరిగారు. నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏది ఏమైనా అరగంట పాటు పంపిణీ చేసి తర్వాత బంద్ చేయడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

కట్ట ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి



కబ్జాకు గురైన భూమిని చూపిస్తున్న రైతులు

- ఇప్పగూడెం దళిత రైతుల డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామ శివారులోని తెట్టకుంట కట్టను ధ్వంసం చేసి దాదాపు రెండు ఎకరాల ఎఫ్‌టీఎల్ భూమిని కబ్జా చేసిన వారిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతులు ఎస్.గట్టుమల్లు, బొంకూరి మల్లయ్య, బొంకూరి మహేష్ డిమాండ్ చేశారు. ఇప్పగూడెం గ్రామశివారులోని తెట్టకుంట వద్ద బాధిత రైతులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పగూడెం గ్రామానికి చెందిన దాదాపు 40 మంది దళిత రైతులు 652సర్వే నంబర్‌లోని తెట్టకుంట కింద 150 ఎకరాల భూమిలో సాగుచేస్తూ జీవనోపాధి సాగిస్తున్నామన్నారు. తెట్టకుంట దాదాపు 40 ఎకరాల విస్తీర్ణం ఉంటుందని, ఈ కుంట కింద ప్రతీ ఏడాది 40 కుటుంబాలం 50 ఏళ్లుగా ఒక్క ఫసల్ పండించుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కాగా, ఇటీవల కొందరు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల అండదండలతో ఇష్టారాజ్యంగా కుంటకట్టను ధ్వంసం చేయడంతో పాటు రెండు ఎకరాల కుంట భూమిని కబ్జా చేశారని తెలిపారు. అధికార పార్టీ నాయకుల అండతో దళిత రైతుల జీవనోపాధికి గండికొడుతూ కుంటకట్టను ధ్వంసం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు బొంకూరి యాదగిరి, పాల భిక్షపతి, కమలమ్మ, గట్టుమల్లు, గుండె లక్ష్మి, అనీల్, అశోక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి విరాళం



ఎల్లయ్యతో తండా వాసులు

జఫర్‌గఢ్: రేగడితండా జీపీ పరిధిలోని టీబీతండా గ్రామంలో నూతన శివాలయ నిర్మాణానికి స్టేషన్ ఘన్‌పూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య రూ.40 వేల విలువ చేసే గ్రానైట్‌ను విరాళంగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్యను ఆయన నివాసంలో తండా వాసులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఆర్టీసీ చౌరస్తాలో రోడ్డుపై కంకర రాళ్లు



భారీ వాహనం రాకతో లేస్తున్న దుమ్ము

జనగామ ఆర్టీసీ చౌరస్తాలో కంకర రాళ్లతో ప్రమాదం పొంచి ఉంది. ప్రతిరోజు సిద్దిపేట రోడ్డు వైపు వెళ్లే ట్రిప్పర్ల నుంచి డ్రైవర్ల అజాగ్రత్తతో కంకర రాళ్లతో పాటు అందులో ఉండే డస్ట్ కింద పడిపోతోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో కంకర రాళ్లు టైర్లకు తగులుతూ పైకి ఎగిరిపడి సమీప వాసులపైకి దూసుకు వస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. డస్ట్‌తో దుమ్ము పైకి లేస్తుండడంతో ద్విచక్రవాహన చోదకులు, కాలిబాటన వెళ్లే ప్రజలు నరకం చూస్తున్నారు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

-జనగామ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



స్టేషన్‌ఘన్‌పూర్: పూజలు చేస్తున్న భక్తులు



రఘునాథపల్లి: మాలధారులతో రాజయ్య



జనగామ రూరల్: పారాయణం చేస్తున్న మహిళలు



చిల్పూరు: పూజలో పాల్గొన్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం అమ్మవారికి ఘనంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. అర్చకులు జీడికంటి వరుణాచార్యులు ఆధ్వర్యంలో చేపట్టిన అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మావురపు రాజశేఖర్, గీత, రాపోలు శేషారెడ్డి, పండుగ రాజేశ్వర్, పండుగ బుచ్చయ్య, కనకయ్య, పర్శరాజు, నారబోయిన గోపాల్‌ముదిరాజ్, శ్రీనివాస్, రాజేందర్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో..

రఘునాథపల్లి: గోవర్ధనగిరి హనుమాన్ ఆలయంలో జనగామ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ముసిపట్ల విజయ్ ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత భక్తి శ్రద్ధలతో హనుమాన్ పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య హనుమాన్ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాలధారులకు భిక్ష (అన్న ప్రసాద) కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ వైకుమార్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ పారాయణం

జనగామ రూరల్: పట్టణంలోని పాత బీటుబజార్‌లోని రామాలయంలో 72వ సీతారామ నవరాత్రోత్సవంలో భాగంగా మంగళవారం భక్తులు, మహిళలు పారాయణం చేశారు. పూజా కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, సీతారామ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అష్టదళ పాదపద్మారాధన పూజ

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం స్వామివారికి అర్చకులు వేదమంత్రాల నడుమ అష్టదళ పాదపద్మారాధన పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఆలయ శాశ్వత దాత సంగోజు మోహన్‌శంకరలక్ష్మి, అర్చకులు రవీందర్‌శర్మ, కృష్ణమాచార్య, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, లక్ష్మి, మల్లికార్జున్, వసంత, మహేష్, గాదె శేఖర్, హరిశంకర్, రాజేష్, విశాల్, కృష్ణ పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



కూలీలకు సూచనలిస్తున్న ఏపీఓ కుమారస్వామి

కొడకండ్ల: కొలతల ప్రకారం కూలీలు ఉపాధి పనులు చేసి పెరిగిన ప్రకారం వేతనాన్ని పొందాలని ఏపీఓ నరిగే కుమారస్వామి కోరారు. మంగళవారం ఏడునూతుల గ్రామంలో ఉపాధిహామీలో చేపట్టిన ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మస్టర్ తనిఖీ చేసి పెరిగిన కూలీ రేటు రూ.307పై అవగాహన కల్పించారు. ఈసీ రమేశ్, ఎఫ్ఏ వెంకన్న, కూలీలు పాల్గొన్నారు.

అండర్‌బ్రిడ్జి సాధన పోరాటాన్ని ఉధృతం చేస్తాం

జనగామ రూరల్: అండర్‌బ్రిడ్జి నిర్మాణం కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ అన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం చేపట్టిన దీక్షలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. అండర్‌బ్రిడ్జి నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలన్నారు. 66రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుంటే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. దీక్షలో తుటి దేవదానం, గడ్డం యాదగిరి, ఎండీ హతీయ సుల్తానా, మచ్చసంధ్య, మేడ నరసింహులు, సురేష్ పాల్గొన్నారు.

భూముల వేలం వెనక్కి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కితీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం అక్రమంగా విద్యార్థినేతలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేస్తూ ప్రకటన చేయకుంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, బూడిద గోపి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు చేయడం దారుణం

సెంట్రల్ యూనివర్సిటీ భూమిని వేలం వేయొద్దని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నిస్తే ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం జిల్లాలో పలు మండలాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిలో లవ కుమార్, సందీప్, యాకన్న, మురళి రమేష్, సాయి, మనీత్ రాజ్ తదితరులు ఉన్నారు.

పోలీసుల అదుపులో ఎస్ఎఫ్ఐ నాయకులు

రఘునాథపల్లి/బచ్చన్నపేట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు కాపాడాలనే డిమాండ్‌తో కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో రఘునాథపల్లి మండలంలోని ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలు గ్రామాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వదిలేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొదల లవకుమార్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు గొడుగు రమేష్, నాయకులు ఉన్నారు. అలాగే బచ్చన్నపేటలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దండుగుల మురళీకృష్ణ తదితరులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టులు సరికాదు

చిల్పూరు: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిర్వహించొద్దని ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, కవరేజికి వెళ్లిన జర్నలిస్టులను అరెస్టు చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో ఆయన మంగళవారం మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తే అరెస్టులు చేయడం దారుణమన్నారు. వెన్నం మాదవరెడ్డి, అలుగు అశోక్, బబ్బుల వంశి, పోలేపల్లి రాము, రాజేందర్ తదితరులు ఉన్నారు.

'హెచ్‌సీయూ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదు'

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూముల జోలికి వస్తే సహించేది లేదని బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు బొంకూరి మహేశ్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో 400 ఎకరాల భూములను వేలం వేసి ఇతర ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు తమ భూముల కోసం శాంతియుతంగా ధర్నా చేస్తుండగా అక్రమంగా లాఠీఛార్జీలు చేయించడం అమానుషమన్నారు. జీడి మోషి, చాగంటి రమేష్, గుగ్గిళ్ల ప్రదీప్, కలకోటి అఖిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్

ప్రవీణ్‌ను హత్య చేసిన దుండగులను శిక్షించాలి

పాలకుర్తి టౌన్: పాస్టర్ ప్రవీణ్ పగడాలను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎన్‌సీసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అనంతోజు రక్షిత డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రక్షిత మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మతోన్మాద శక్తుల ఆగడాలను అరికట్టేందుకు ప్రభుత్వం, అధికారులు స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో యుఈపీఎఫ్ పాస్టర్లు ఎం.జాన్‌పాల్, ప్రభకార్, యాకోబ్, ఇశ్రాయేల్, మత్తయి ,లాజరస్ ,మహేష్, మమత, పాల్ బన్నీ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

లింగాలఘణపురం: మండల కేంద్రంలో ప్యాట ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి 1998–1999 పదో తరగతి బ్యాచ్ తోటి స్నేహితులు మంగళవారం రూ.15వేల సాయం అందజేశారు. రమ, శ్రవంతి, శ్రీనివాసు, సోమవెంకటేశ్, ఆంజనేయులు, రమేశ్, సత్యనారాయణ ఉన్నారు.

శ్రీరామ నవమికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీన జరిగే శ్రీరామనవమి వేడుకలకు మంగళవారం దేవస్థాన చైర్మన్ మూర్తి ఆధ్వర్యంలో హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి ఆహ్వానించారు. ఏఈ వంశీ, అర్చకులు భార్గావాచార్యులు, సిబ్బంది భరత్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మిరపవరుగు అపహరణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలో నీలం వాసు అనే రైతుకు చెందిన మూడు క్వింటాళ్ల మిరప వరుగు గుర్తు తెలియని దుండగులు అపహరించిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. నీలం వాసు తాను సాగు చేసిన మిరప పంటలో కోసిన మిరప వరుగును కల్లంలో ఆరబోసి కుప్ప పోశారు. ఉదయం వెళ్లి చూడగా కుప్పపై పరదాలు తొలగించి ఉండగా.. మిరప వరుగు దొంగిలించినట్లు గుర్తించారు. గుర్తు తెలియని దుండగులు మూడు క్వింటాళ్ల మిరప వరుగు అపహరించారని, దుండగులను గుర్తించి న్యాయం చేయాలని బాధిత రైతు వాసు కోరారు.

నీటితొట్టిలో పడి వ్యక్తి మృతి

పాలకుర్తి: నీటి తొట్టిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వావిలాలలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన దొంగరి అశోక్ (42) ప్రమాదశాత్తు నీటితొట్టిపడి మృతి చెందాడని చెప్పారు. మృతుడి భార్య హరిత ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

చోరీ కేసు నమోదు

విస్నూరు గ్రామంలో తక్కెలపల్లి బుమక్క వద్ద నుంచి దుండగులు బంగారం చోరీకి పాల్పడ్డారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విస్నూరుకు చెందిన బుమక్క ఆరుబయట ఉండగా దుండగులు వచ్చి మూడు తులాల బంగారం ఎత్తుకెనట్లు ఆయన చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గాంధీ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ సుమన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

'మామునూరు ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: మామునూరు ఎయిర్‌పోర్టుకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరును పెట్టాలని కురుమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బుయ్య గట్టయ్య డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జయంతిని ఈనెల 3వ తేదీన ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, గట్టుమల్లన్న, కొమురవెల్లి, ఐనవోలు దేవస్థానాల చైర్మన్ పదవులు కురుమలకే కేటాయించాలన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కురుమలు చైతన్యం కావాలని, న్యాయమైన హక్కుల సాధనకు కురుమలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్య పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నిత్యావసరాల అందజేత

పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన గుంటోజు మధు ఇటీవల మృతి చెందాడు. కాగా, మంగళవారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావర సరుకులు అందజేశారు. శ్రీకాంత్, హరీశ్, కుమారస్వామి, రత్నాకర్,భాస్కర్ ఉన్నారు.